క్లుప్తంగా

కాంగ్రెస్ మండల అధ్యక్షురాలిగా విజయ



పరకాల: పరకాల మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా మండలంలోని నాగారం గ్రామానికి చెందిన వార్డు సభ్యురాలు పసుల విజయను ఎన్నుకున్నట్లు పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు కంక సరళాదేవి, మండల అధ్యక్షుడు కట్కూరి దేవేందర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా నియామక పత్రాన్ని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి చేతుల మీదుగా అందుకున్న ఆమె తన నియామకానికి కృషిచేసిన జిల్లా, మండల,పట్టణనాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

టెట్ పరీక్ష ఫీజు తగ్గించాలి

పరకాల: రాష్ట్రంలో త్వరలో నిర్వహించనున్న టెట్ పరీక్ష ఫీజును తగ్గించాలని పరకాల మున్సిపల్ కోఆప్షన్ సభ్యురాలు ముఫీనా ఫాతిమా హమీద్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎంతో ఆశతో ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు ప్రభుత్వం పెంచిన ఫీజు నిరుత్సాహానికి గురిచేసిందన్నారు. తక్షణమే ప్రభుత్వం చొరవ చూపి టెట్ పరీక్ష ఫీజు తగ్గించాలని ఆమె డిమాండ్ చేశారు.

సమాజ హితానికి కవిత్వం దోహదం

హన్మకొండ అర్బన్: సమాజంలో మంచిని పెంచడానికి కవిత్వం ఎంతగానో ఉపయోగపడుతుందని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత అంపశయ్య నవీన్ అన్నారు. వరల్డ్ పీస్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో ఎల్లలు లేని కవిత్వం మానవళికి మార్గదర్శనం అనే అంశంపై హనుమకొండ సమీకృత కలెక్టరేట్ ప్రాంగణంలో తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ భవనంలో సర్వభాషా కవి సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో పద్య కవులను సన్మానించి ప్రశంస పత్రాలు అందజేశారు. చైతన్య విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య గుర్రపు దామోదర్, ఎండీ.సి రాజుద్దీన్, ఆచార్య బానోతు సురేష్‌లాల్, శ్రీపాద సుధాకర్ రావు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ హఠాన్మరణం

కాజీపేట అర్బన్: కాజీపేట మండలం కడిపికొండలోని శ్రీభూలక్ష్మి ఆటో యూనియన్ ఆటో డ్రైవర్ సాదినేని శ్రీనివాస్ ఆదివారం గుండెపోటుతో మృతి చెందాడు. నిరుపేద కుటుంబానికి చెందిన మృతుడు శ్రీనివాస్‌కు ఇద్దరు కుమార్తెలు, భార్య ఉన్నారు. ఆర్థికంగా వెనుకబడిన బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

మడికొండ: చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన మడికొండలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కాజీపేట మండలం మడికొండ గ్రామానికి చెందిన సిగ్ర రమేష్ (55) శనివారం మధ్యాహ్నం ఇంటిపై నుంచి కింద పడడంతో గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అతన్ని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం ఇంటికి తీసుకువచ్చారు. ఈక్రమంలో ఆదివారం ఫిట్స్ రావడంతో మళ్లీ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ రమేష్ మృతి చెందాడు. మృతుడి కుమారుడు శశికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సీఎంను కలిసిన రామకృష్ణ

హన్మకొండ చౌరస్తా: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని టీపీసీసీ ఎస్సీ సెల్ జిల్లా బాధ్యుడు, వరంగల్ లోక్‌సభ సీటు ఆశిస్తున్న డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ హైదరాబాద్‌లోని సీఎం క్యాంపు కార్యాలయంలో ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి జ్ఞాపిక అందజేశారు. అధికారంలో ఉన్నా లేకపోయినా కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలను గుర్తించాలని కోరారు. వరంగల్ ఎంపీ టికెట్ తనకు కేటాయిస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.


చిరుధాన్యాలు ఆరోగ్యకరం



హసన్‌పర్తి: చిరు ధాన్యాలు ఆరోగ్యకరమని మహర్షి గోశాల చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు రమేష్ అన్నారు. చింతగట్టులోని మహర్షి గోశాలలో రికార్డ్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో మిల్లెట్స్ ఉత్పత్తుల ప్రదర్శనను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరుధాన్యాలు తీసుకోవడం వల్ల శారీరక రుగ్మతలు అదుపులో ఉంటాయన్నారు. జంక్ ఫుడ్ బారిన పడకుండా చిరుధాన్యాలను అలవాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రికార్డ్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు కుసుమ సురేష్, మిల్లెట్స్ కుకింగ్ నిపుణురాలు కవిత, మిల్లెట్ ప్రమోటర్ నిమ్మల శ్రీనివాస్‌తో పాటు గోశాల కార్యదర్శి కిషన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగట్టు గుట్ట జాతరకు వేళాయె..

- నేటి నుంచి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు
- రాత్రి 11.48 గంటలకు కల్యాణం
- ఐదురోజుల పాటు వేడుకలు
- జాతర చరిత్రలో ఛైర్మన్ లేకుండా ఈసారి ఉత్సవాలు



ఎర్రగట్టు గుట్టపై వెలసిన వేంకటేశ్వరస్వామి దేవాలయం

హసన్‌పర్తి: ఎర్రగట్టు వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం ప్రారంభం కానున్నాయి. ఈ ఉత్సవాలు ఐదురోజుల పాటు కొనసాగనున్నాయి. హసన్‌పర్తి – భీమారం గ్రామాలు సంయుక్తంగా ఈ వేడుకలను నిర్వహించనున్నాయి. హోలీ వేడుకలు ముగిశాక ఇరు గ్రామాల నుంచి అలివేలు మంగ – వేంకటేశ్వరస్వామి ప్రతిమలను రథాలపై ప్రతిష్ఠించి భారీ ప్రదర్శనలతో ఎర్రగట్టు గుట్టపైకి తీసుకొస్తారు. దీంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి.

ఈసారి ఛైర్మన్ లేకుండానే..

ఎర్రగట్టు వేంకటేశ్వస్వామి ఉత్సవాలు ఈసారి ఛైర్మన్ లేకుండానే నిర్వహిస్తున్నారు. 14 మందితో ధర్మకర్తలతో కమిటీని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అందులో ధర్మకర్తలు కలిసి ఒకరిని తాత్కాలిక ఛైర్మన్‌ను ఎంపిక చేసుకునే అవకాశం ఉంది. గతంలో కూడా ఉత్సవ కమిటీని నియమించినప్పుడు ఛైర్మన్‌ను ధర్మకర్తలు ఎన్నుకున్నారు. ప్రస్తుతం ధర్మకర్తల్లో నాలుగు వర్గాల వారు ఉన్నారు. స్థానిక ఎమ్మెల్యే నాగరాజు కూడా పట్టించుకోకపోవడంతో ఛైర్మన్ నియామకం జరగలేదని స్థానికంగా ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఛైర్మన్ నియామకం లేకపోవడంతో ఉత్సవ ప్రమాణ స్వీకారానికి కమిటీ సభ్యులు ముందుకు రాలేదు. జాతర చరిత్రలో ఛైర్మన్ లేకుండా ఉత్సవాలు నిర్వహించడం ఇదే తొలిసారి.

ఏర్పాట్లు పూర్తి

భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఈఓ కిషన్‌రావు, ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. శీఘ్ర దర్శనం, ప్రత్యేక దర్శనం కోసం సౌకర్యాలు కల్పించినట్లు చెప్పారు.

స్వామి వారికి పట్టువస్త్రాల సమర్పణ



పట్టువస్త్రాలు సమర్పిస్తున్న అతిథులు

హసన్‌పర్తి: ఎర్రగట్టు వేంకటేశ్వరస్వామికి ఆదివారం పట్టువస్త్రాలు సమర్పించారు. మధ్య ప్రదేశ్ రాష్ట్రంలో ఐఏఎస్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న చింతగట్టుకు చెందిన పరికిపండ్ల నరహరి.. ప్రతిఏటా హోలీ సందర్భంగా స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది నరహరి తన సోదరులు రాము, లక్ష్మణ్, శ్రీనివాస్, వేణు, దామోదర్, అశోక్ ద్వారా పట్టు వస్త్రాలు పంపించారు. ఈ సందర్భంగా ఆలయంలో వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ పూజారులు పార్థసారధి, దేవస్థాన ధర్మకర్తలు పెద్దమ్మ సురేష్, శైలజ, అటికం శ్రీనాథ్, నరహరి కుటుంబ సభ్యులు మహేశ్వరి, కల్పన, సింధు, సుమలత, దీపిక, సత్యరాజ్ పాల్గొన్నారు.

కార్యక్రమాల వివరాలు

- ఈనెల 25న (సోమవారం) సాయంత్రం 5గంటలకు హసన్‌పర్తి – భీమారం గ్రామాల నుంచి ఎర్రగట్టు గుట్ట మీదికి స్వామివారి రాక, రాత్రి పెద్దచక్రాల ప్రదర్శన
- రాత్రి 11.48గంటలకు స్వామి వారి కల్యాణం
- 26న (మంగళవారం) సాయంత్రం 7గంటలకు చిన్న చక్రాల ప్రదర్శన
- 27న (బుధవారం) విశేష పూజ, కుంకుమార్చనలు, హారతి ప్రసాద వినియోగాలు
- 28న (గురువారం) క్షీరాభిషేకం, అర్చనలు
- 29న (శుక్రవారం) సాయంత్రం 6గంటలకు హసన్‌పర్తి – భీమారం గ్రామాలకు స్వామివారి తిరుగు పయణం

భారీ బందోబస్తు

ఉత్సవాలను పురస్కరించుకుని జాతరకు భారీ బందోబస్తు నిర్వహిస్తున్నట్లు కాకతీయ యూనివర్సిటీ పోలీస్ ఇన్‌స్పెక్టర్ సంజీవ తెలిపారు. ఇద్దరు పోలీస్ ఇన్‌స్పెక్టర్లు, నలుగురు సబ్ ఇన్‌స్పెక్టర్లు, నలుగురు ఏఎస్సైలు, 10మంది హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, హోంగార్డులు విధులు నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు.



స్వామి మూల విరాట్



స్వామివారి ప్రతిమలు



జాతర ప్రాంగణంలో వెలిసిన దుకాణాలు

గురుకులంలో ప్రవేశాలకు గడువు పొడిగింపు

దామెర : తెలంగాణ మైనారిటీ గురుకుల పాఠశాల అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు గడువు పొడిగించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీలత ఆదివారం ఒక ప్రకటనలో తెలి పారు. మండలంలోని ఒగ్లాపూర్ సమీపంలోని పరకాల మైనారిటీ గురుకుల పాఠశాలలో దరఖాస్తులు చేసుకునేందుకు ఈ నెల 31 వరకు గడువు పొడిగించారని అన్నారు. 5వ తరగతి, ఇంటర్మీడియట్ సీఈసీ, ఎంఈసీలో అన్ని వర్గాల విద్యార్థులకు అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు. 6, 7 ,8 తరగతుల్లో కేవలం మైనారిటీ విద్యార్థులకు మాత్రమే అవకాశం ఉన్నట్లు వెల్ల డించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 7995057981, 9989416061, 9963802350 నంబర్లను సంప్రదించాలని అన్నారు.

హోలీ వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి



క్రాంతికుమార్, సీఐ

ఆత్మకూరు: హోలీ వేడుకలను మండల ప్రజలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సీఐ క్రాంతికుమార్ అన్నారు. ఆదివారం ఆయన పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతూ హోలీ వేడుకలు రోడ్లపై ఇతరులకు ఇబ్బందులు కలిగించేలా జరుపుకోవద్దన్నారు. సాంప్రదాయ రంగులు మాత్రమే చల్లుకోవాలని కళ్లకు, ఒంటికి ఇబ్బంది కలిగించే కృతిమ, రసాయన రంగులు వాడవద్దన్నారు. హోలీ వేడుకల అనంతరం రంగులు పూసుకున్న యువకులు, పిల్ల లు చెరువుల్లో, బావుల్లో ఈతకు వెళ్లవద్దన్నారు. మద్యం సేవించి వాహనాలు నడుపరాదన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలి

- భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



కాంగ్రెస్‌లో చేరిన వారితో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

శాయంపేట: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిని గెలిపించాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. ఆదివారం నియోజకవర్గ కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో మండలంలోని కాట్రపల్లికి చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీల ద్వారా పేదలకు మేలు జరుగుతుందన్నారు. మాజీ ఎంపీటీసీ తరాల సౌందర్యరాజమౌళి, మాజీ వార్డు సభ్యులు తరాల పెద్దమొగిలి, నాయకులు భిక్షపతి, వీరన్న, ఆరె స్వామి, రాజు తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి, నాయకులు వాంకుడోతు జగన్, నర్సయ్య పాల్గొన్నారు.

'జంగా'ను కలిసిన రెడ్డి సంఘం నాయకులు



జంగా రాఘవరెడ్డికి పూలబొకే అందిస్తున్న రెడ్డి సంఘం నాయకులు

ఐనవోలు: తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ ఛైర్మన్‌గా నియమితులైన జంగా రాఘవరెడ్డికి ఐనవోలు మండల రెడ్డి సంఘం నాయకులు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి పూలబొకే అందించి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించారు. సన్మానించిన వారిలో రెడ్డి సంఘం అధ్యక్షుడు చింతలపూరి హరికృష్ణరెడ్డి, దివాకర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, దేవేందర్ రెడ్డి, జైపాల్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, బీరం దేవేందర్ రెడ్డి, యాదవ రెడ్డి తదితరులు ఉన్నారు.

ఎక్సలెన్స్ అవార్డు గ్రహీతకు సన్మానం



అశోక్‌ను సన్మానిస్తున్న సంఘం నాయకులు

హన్మకొండ: ఇండియా ఎక్సలెన్స్ అవార్డు గ్రహీత పరికిపండ్ల అశోక్‌ను పద్మ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. కరోనా సమయంలో ప్రముఖ హోమియోపతి వైద్యుడు డాక్టర్ అశోక్ పరికిపండ్ల అనేక ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వ్యాధి నివారణ మందును ఉచితంగా పంపిణీ చేశారు. ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ద్వారా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆయన సేవలను గుర్తించిన కర్ణాటకకు చెందిన బ్లైండ్ విన్ సంస్థ.. ఇండియన్ ఎక్సలెన్స్ అవార్డుకు ఎంపిక చేసి ఈనెల 17న అవార్డు అందించి సన్మానించింది. హనుమకొండలోని పద్మశాలి భవనంలో అవార్డు గ్రహీతను పద్మ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం అభినందించారు. కార్యక్రమంలో మహబూబాబాద్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చిలుకమారి వెంకటేశ్వర్లు, రిటైర్డ్ ఎంపీడీఓ గుల్లెపల్లి విద్యాసాగర్, అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ పూర్వ గవర్నర్ మంత్రి లింగమూర్తి, మాజీ కార్పొరేటర్ కుసుమ లక్ష్మీనారాయణ, పద్మశాలి పరపతి సంఘం ప్రధాన కార్యదర్శి గజ్జల అమరేందర్, బ్రహ్మకుమారి వేల్పుల నరేష్, సంగిశెట్టి సందీప్, సూర్యనారాయణ, దివ్యశ్రీ, రమేష్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటాలే శరణ్యం



సమావేశంలో మాట్లాడుతున్న పెద్దారపు రమేశ్

నర్సంపేట : ప్రజాసమస్యల పరిష్కారానికి పోరాటాలే శరణ్యమని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్ తెలిపారు. పట్టణంలోని ఓంకార్ భవన్‌లో సింగతి మల్లికార్జున్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన పార్టీ డివిజన్ కమిటీ సమావేశంలో రమేశ్ మాట్లాడారు. పాలక పార్టీలు అధికారం దక్కించుకోవడానికి అనేక హామీలు గుప్పించి గద్దెనెక్కి ఆచరణలో విస్మరిస్తున్నారని విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ అనేక హామీలు ఇచ్చి గద్దెనెక్కి మతోన్మాదంతో కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తోందని మండిపడ్డారు. మళ్లీ పార్లమెంట్ ఎన్నికల్లో గెలిచేందుకు మోసపూరిత విధానాలతో వస్తోందని ధ్వజమెత్తారు. ఎన్నికల హామీలను విస్మరించిన పార్టీలను గద్దె దించాలని కాంక్షించారు. నర్సంపేటలోని స్లమ్ ఏరియాల్లో సమస్యలు నెలకొన్నాయని చెప్పారు. పేదలు నివసించే కాలనీల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎంసీపీఐ(యూ), బీఎల్‌ఎఫ్ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు కుసుంబ బాబురావు, నాగెల్లి కొమురయ్య, వంగల రాగసుధ, డివిజన్ కార్యదర్శి మహ్మద్ రాజాసాహెబ్, జిల్లా కమిటీ సభ్యులు కేశెట్టి సదానందం, కలకోట్ల యాదగిరి, జన్ను రమేశ్, దామ సాంబయ్య, గాజుల వెంకటయ్య, మార్త నాగరాజు, బుడిమె సురేందర్, అలీ తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ సాధించే వరకు పోరాటం ఆగదు

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి మురళి



సమావేశంలో మాట్లాడుతున్న మురళి

దామెర: ఎస్సీ వర్గీకరణ సాధించే వరకు అలుపెరగని పోరాటం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి జిల్లెల్ల మురళి అన్నారు. మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మండల విస్తృతస్థాయి సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీరణ తుదిదశకు చేరుకుందని అన్నారు. మందకృష్ణ ఆధ్వర్యంలో మాదిగలకు రిజర్వేషన్ ఫలాలు త్వరలో అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో నాయకులు గజ్జి ప్రదీప్, రవికుమార్, ఈసంపల్లి రాజు, వడ్డెపల్లి సైలాన్‌బాబు, గజ్జి వెస్లీ తదితరులు పాల్గొన్నారు.

మండల కమిటీ ఎన్నిక

ఎమ్మార్పీఎస్ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా గజ్జి మధుకర్, అధికార ప్రతినిధిగా చిలువేరు సూర్యకిరణ్, ఉపాధ్యక్షుడిగా వడ్డెపల్లి సాగర్, ప్రధాన కార్యదర్శులుగా గజ్జి ప్రదీప్, వడ్డెపల్లి రాజేష్, కార్యదర్శులుగా గోవిందు విజయ్‌కుమార్, చిలువేరు ప్రవీణ్, సహాయ కార్యదర్శిగా వడ్డెపల్లి రఘుపతి, బొర్ర రాజశేఖర్, ప్రచార కార్యదర్శిగా వడ్డెపల్లి పవన్‌లను ఎన్నుకున్నారు.

జేసీబీ సీజ్



శాయంపేట: మండలంలోని వసంతాపూర్ గ్రామశివారు పెద్దమ్మ కుంటలో అక్రమంగా మట్టిని తోడుతున్న జేసీబీని ఆదివారం సీజ్ చేసినట్లు ఎస్సై ప్రమోద్‌కుమార్ తెలిపారు. మైనింగ్, రెవెన్యూ అధికారుల నుంచి అనుమతులు లేకుండా మట్టిని తోడుతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు నివేదించినట్లు ఆయన పేర్కొన్నారు.

బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిక



సంగెం : మండలంలోని కుంటపల్లికి చెందిన మాజీ సర్పంచ్ ఎలగోయ లింగయ్య, నాయకులు జన్ను దేవేందర్, గోపతి మల్లయ్య, పెంతల సంపత్, ఎరుకల కుమారస్వామి, శంకర్‌లింగం, పెంతల మోహన్, కద్దురి కుమారస్వామి, గోనె కుమారస్వామితోపాటు సుమారు 50 మంది పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి సమక్షంలో హనుమకొండలోని ఆయన నివాసంలో ఆదివారం బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చొల్లేటి మాధవరెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు పెంతల ప్రతాప్, నాయకులు జన్న కొమురు మల్లు, యాకయ్య పాల్గొన్నారు.

ఘనంగా మట్టల ఆదివారం



మట్టల పండుగ నిర్వహిస్తున్న క్రైస్తవులు

శాయంపేట: మండల కేంద్రంలో ఆదివారం సీఎస్ఐ చర్చి ఆధ్వర్యంలో క్రైస్తవులు ఘనంగా మట్టల పండుగను నిర్వహించారు. ప్రధానవీధుల గుండా క్రైస్తవ భక్తిగీతాలను ఆలపిస్తూ ఊరేగారు. క్రీస్తు జెరూసలేము పట్టణంలో ప్రవేశించిన దినాన్ని పురస్కరించుకుని మట్టల పండుగను నిర్వహిస్తున్నట్లు ఫాస్టర్ డి.అనిల్‌కుమార్ తెలిపారు. క్రైస్తవ పెద్దలు ప్రవళిక, పాల్, బాబు, మోహన్, పాపయ్య, స్వరూప, మనిమాల తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యలు పరిష్కారం కాదు



నగదు, బియ్యం, సరుకులు అందజేస్తున్న సీఐ పవన్‌కుమార్, ఎస్సైలు

గీసుకొండ : ఆత్మహత్యలు సమస్యలకు పరిష్కారం కాదని సీఐ ఎల్.పవన్‌కుమార్ తెలిపారు. మండలంలోని గోపాల్‌రెడ్డినగర్‌కు చెందిన భవన నిర్మాణ కార్మికుడు ఉడుత శివ ఇటీవల ఆత్మహత్య చేసుకోగా బాధిత కుటుంబానికి ఎస్సైలు వెంకన్న, జానీ పాషాలతో కలిసి సీఐ పవన్‌కుమార్ ఆదివారం రూ.5 వేల నగదుతోపాటు క్వింటా బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాన్ని సీఐ పరామర్శించి మాట్లాడారు. ఆర్థిక సమస్యలు, కుటుంబ కలహాలు, ఇతర ఎలాంటి బాధలున్నా ఆత్మహత్యలు తగదన్నారు. ఇంటి పెద్ద ఆత్మహత్య చేసుకుంటే కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

జామా మసీదు కమిటీ ఎన్నిక



సంగెం : మండలంలోని గవిచర్లలోని జామా మసీదు కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు ఇస్మాయిల్ మీడియాకు వివరాలు వెల్లడించారు. అధ్యక్షుడిగా మహమ్మద్ సాధిక్, ఉపాధ్యక్షుడిగా రఫీ, ప్రధాన కార్యదర్శిగా సర్వర్, సలహాదారులుగా మహబుబ్, సమీర్ పాషా, సభ్యులుగా ఫాజిల్, నిజాం, ముజ్జు, రహీమ్ పాషా ఎన్నికైనట్టు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ముస్తఫా, మోయిన్ పాషా, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్ల పట్టివేత



ఎల్కతుర్తి: భీమదేవరపల్లి మండలం రత్నగిరి గ్రామశివారులో ఓ రైతుకు చెందిన పట్టా భూమిలో నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు. పక్కా సమాచారం మేరకు మట్టిని తరలిస్తున్న రెండు టిప్పర్లను పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్సై వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు. రైతు ఫిర్యాదు మేరకు టిప్పర్ల ఓనర్లు, డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.